

పిడుగుపడి చెట్టు ధ్వంసం



విరిగి పడిన చెట్టు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని ఓ గిరిజన గ్రామంలో వర్షం లేకుండా అకస్మాత్తుగా పిడుగు పడటం స్థానికులను ఆశ్చర్య పరిచింది. ఈ ఘటనలో చెట్టు ధ్వంసమయ్యింది. ఈ సంఘటన అరకులోయ మండలంలోని లోతేరు పంచాయతీ వంతలగూడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రామ్మూర్తికి చెందిన కాఫీ, మిరియాలు తోటలు నేల కొరిగాయి. అలాగే పలు రకాల చెట్టు నేల కొరిగాయి.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

గ్రామ వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు-రణభేరి రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గ్రామ, వార్డు వాలంటీర్లకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిల బెట్టుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. హామీల అమలు కోరుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట గ్రామ, వార్డు వాలంటీర్ ల రణభేరి రిలే నిరాహార దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు వాలంటీర్ లను విధుల్లోకి తీసుకుని వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, 10 వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాలంటీర్లకు బకాయి పడ్డ వేతనాలు తక్షణం చెల్లించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందర్‌రావు, నాయకులు చిట్టిబాబు, సత్యారావు, వాసు, దొర, సింహాచలం, రమేష్, కృష్ణారావు, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లు ఎగుర వేస్తే చర్యలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రజలకు భయభ్రాంతులకు గురి చేసి రెచ్చగొట్టే విధంగా ఆదివాసి ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరవేస్తే కఠిన చర్యలు తప్పవని అరకులోయ సీఐ హిమగిరి హెచ్చరించారు. అరకులోయలోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరకులోయ,అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సంబంధించి డ్రోన్స్ సర్వే నిలిపివేయబడిందని,రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ప్రకటన చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ఉన్నారన్నారు. మంత్రి ఆదేశాలు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదివాసి ప్రజాసంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, పేసా కమిటీ నాయకులతో సమావేశం పెట్టి సర్వే నిలిపి వేయబడిందని చెప్పడం జరిగిందని తెలిపారు. గ్రామసభ, పేసా అనుమతులు లేనిదే ఈ ప్రాజెక్టు ముందుకు సాగదని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ యజమాన్యానికి చెప్పి సర్వే నిలిపివేయబడిందని స్పష్టమైన ప్రకటన చేసి ఉన్నారని తెలిపారు. ఈ విధంగా ఆదివాసి ప్రాంతంలో ప్రజలకు రెచ్చగొట్టే విధంగా ఎగురవేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దీనిపై అనంతగిరి, అరకులోయ ప్రాంతంలో కొన్ని ప్రత్యేక బందాలను ఏర్పాట్లు చేసి నిఘా ఉంచామని అరకు సీఐ హిమగిరి స్వస్టం చేశారు.

జన్‌మన్ గృహాల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఆదివాసి పివీటీజీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన పీఎం జన్మన్ గృహాల బకాయి పడ్డ బిల్లులు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ముంచింగిపుట్టు, పెదబయలు మండలాల ఆదివాసీ గిరిజన సంఘం నాయకులతో సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మాన్న పడాల్ హాజరయ్యారు. రెండు మండలాల్లో సమస్యలను చర్చించారు. అనంతరం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, పీఎం జన్మన్ హౌసింగ్ లబ్ధిదారులకు బకాయిలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ప్రోత్సహకం లక్ష రూపాయలు వెంటనే చెల్లించాలన్నారు. రెండు నెలలు పాటు పీఎం జన్మన్ హౌసింగ్ బిల్లులు జమ కాకపోవడంతో గృహాలు తొలగించి షెడ్‌లు ఏర్పాటు చేసి నివాసముంటున్నారన్నారు.పీఎం జన్మన్ నిధులతో గ్రామాలలో రోడ్లు, మంచి నీరు, కరెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాద్, సంఘం కార్యదర్శి కే.నర్సయ్య, పెదబయలు మండల కార్యదర్శి గంగాధరం, మండల నాయకులు పి.రాందాస్, కె డోంబ్రూ, జీన్నబంద్, నీలకంఠం, బుజ్జిబాబు, దేవన్న, కె కొండయ్య, సిద్దేశ్వరావు, గోపాల్, గణపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మన్నపడాల్

పంట ఉత్పత్తుల విక్రయాల్లో..

దళారుల ప్రమేయం తగ్గించాలి

-కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు, : జిల్లాలో వన్ దన్ వికాస కేంద్రాలను బలోపేతం చేయాలని, పంట ఉత్పత్తుల అమ్మకాల్లో దళారుల ప్రమేయం తగ్గించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. భగవాన్ బిర్సా ముండా 150 వ జయంత్యుత్సవాలు సందర్భంగా సోమవారం స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన సమావేశములో గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వన్ దన్ వికాస్ కేంద్రాల ద్వారా వివిధ రకాల పంటలను, వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ ధరకు కొలుగోలు చేసి, గిరిజన మహిళల ఆర్థిక పురోగాభివద్ధికి జీవన పరిస్థితులును మెరుగుపరచడానికి , జీవనోపాధులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు . శిక్షణల ద్వారా సాంకేతికను అందిపుచ్చుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఉండటంతో మన ప్రాంతంలో పండే పంటలను మార్కెటింగ్ చేసుకోనుటకు ఉండే అనేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్ దన్ వికాస్ కేంద్రాలలో ఉన్న నిధులను దుర్వినియోగం చేసినా క్రమ శిక్షణ చర్యలు తప్పవన్నారు. ఈ ప్రాంతంలో పండే కాఫీ, మిరియాలు , అల్లం , పసుపు , అడ్డాకుల, రాజ్మా వంటి పంటలను దళారుల ప్రమేయం లేకుండా హబ్‌ల ద్వారా సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ ద్వారా మార్కెటింగ్ చేసుకొనుటకు డిమాండ్‌కు తగ్గట్లు సప్లై ఉండాలని, దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 106లు వన్ ధన్ వికాస్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లా లో ఉన్న1617 పివిటిజి గ్రామాలలో ఇన్ఫర్మేషన్ , ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ ఐఈసీ ప్రోగ్రాంల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి పెద్ద ఎత్తున ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు , అయుష్ మాన్ భారత్ కార్డులు తదితర పత్రాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కలెక్టర్, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ, జన్ జాతీయ గౌరవ్ దివాస్ లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఎపివో, వేంకటేశ్వర్లు, డి ఆర్ డిఏ పిడి వి. మురళి , పీఎమ్ యు రాంబాబు పాల్గొన్నారు.



సంతకాలు చేపడుతున్న వైసిపి నేతలు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణలో భాగంగా చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ పరిధిలో ఆ పార్టీ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ మండల అధ్యక్షులు పాంగి గణబాబు, జెడ్‌పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి, వైస్ సర్పంచ్ కొర్రా ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు, పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్థాపించిందని తెలిపారు. కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జల్లి సుధాకర్, రాంబాబు, పి.యోసేపు, పి.వీరన్న పడాల్, కె. రాజుబాబు, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-చింతపల్లి : విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది వంటిదని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయభారతి అన్నారు. కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో లభ్యమయ్యే విద్యా వసతులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీ, క్రీడా మైదానం, కంప్యూటర్ ల్యాబ్ వంటి సౌకర్యాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ సెల్, ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యూత్ క్లబ్, సాంస్కృతిక విభాగం వంటి విభాగాల కార్యకలాపాలను వివరించారు. విభాగాల వారీగా అధ్యాపకులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తమ సబ్జెక్ట్ పరిధి, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు పి.లలిత (తెలుగు), కె.శ్రీనివాస్ (సైన్స్), సుజాత (కామర్స్), ప్రసంగించారు. అనంతరం సీనియర్ విద్యార్థులు కొత్త విద్యార్థులకు కళాశాల కార్యకలాపాలు, క్లబ్‌లు, ఈవెంట్లు గురించి పరిచయం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



స్టూడెంట్స్ ఇండక్షన్ కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు

అన్నవరం బ్రిడ్జి తక్షణమే నిర్మించాలి

- మండలవాసులు ఆందోళన
- 10వ తేదీన పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ హామీతో ధర్నా విరమణ
- పనులు ప్రారంభించక పోతే 11న మళ్లీ ధర్నా



ఆందోళన చేస్తున్న ప్రజలు



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- విఆర్‌పురం: అన్నవరం బ్రిడ్జి నిర్మించాలని మండలానికి చెందిన పలువురు రాజకీయాలకు అతీతంగా సోమవారం ఉదయం 10 గంటలకు అన్నవరం బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళనలో పాల్గొన్నారు. ఎస్సై సంతోష్‌కుమార్ సిబ్బందితో వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప చేసే ప్రయత్నం చేశారు. అయితే ప్రజలు ఉన్నతాధికారులు వచ్చి హామీ ఇచ్చేవరకూ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని భీష్మించుకుని కూర్చున్నారు. తహశీల్దార్ సరస్వతి మీ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.అయినా ప్రజలు వినలేదు. దీంతో ఐటిడిఎ పిఒకి సమాచారం అందించి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.అయినా సరే జిల్లా అధికారులు స్పష్టమైన హామీ ఇస్తేనే తప్ప ఆందోళన విరమించమని చెప్పడంతో స్పందించిన సదరు అధికారులు ప్రాజెక్ట్ అధికారి, జిల్లా కలెక్టర్‌కి సమస్య తీవ్రతను తెలియజేసి స్పష్టమైన హామీ ఇప్పించారు. ఈ నెల 10వ తేదీన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు, డైవర్షన్ దారి పనులను ప్రారంభిస్తామని దయచేసి ఆందోళన విరమించాలని చెప్పడంతో ఆందోళన విరమించారు. 10వ తేదీన పనులు ప్రారంభించక పోతే 11న మళ్లీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపియం పార్టీ మండల కార్యదర్శి,శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మండల ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్‌లు పూనం సరోజిని, కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, పిట్టా రామారావు, ఎంపిటిసిలు పూనం ప్రదీప్ కుమార్, బంధం విజయలక్ష్మి, ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ, సిపిఎం జిల్లానాయకులు సున్నం రాజులు, సోయం చినబాబు, పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామమూర్తి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎపిఒ రమణకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి- రంపచోడవరం : వేములకొండ పంచాయతీలోని పలు గ్రామాల్లో సమస్యలు నెలకొన్నాయని, చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తారని మండల అధ్యక్షులు విద్యాసాగర్ డిమాండ్ చేశారు. కాకవాడ సీమగండి, వెట్టి చిలకలు, దార్లవలస, తిరగటి రాళ్ల చిలక వీధి, రాకోట, సువర్ణవాడ, దెబ్బవలస, సోకులగూడెం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాకవాడనుండి చిలకవీధి వరక్నూ రోడ్డు నిర్మాణం, కాకవాడ నుండి దార్లవరస వరకు పది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రాకోట నుండి సువర్ణ వరకూ సిసి రోడ్ల చేపట్టాలని, వేములకొండ కొత్తవీధి మార్గమధ్యలో కల్వర్ట్ నిర్మించాలని, చలకవీధి నుండి జీడిపాకాల వరకు, సోకుల గూడెంలో కల్వర్ట్ నిర్మించాలని, కాకవాడ, వెట్టి చిలకలు చిలకవీధి రాకోట, పీరుకొండ, దెబ్బవలస, ధారగూడెం, సోకుల గూడెం, దార్లవలస గ్రామాల్లో అంగన్‌వాడి కేంద్రానికి ప్రహరీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనులు సాగు చేస్తుంటే ఎలా అడ్డుకుంటారు?

ప్రజాశక్తి-కూనవరం: గ్రామంలో లేని గిరిజనేతరుని భూమిలో గిరిజనులు సాగు చేసేందుకు వెళుతుంటే పోలీసులు అడ్డుకుంటు న్నారని ఎవరు అడ్డుపెట్టినా భూపోరాటం ఆగదని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు హెచ్చరించారు. న్యాయబద్ధమైన భూపోరాటం చేస్తుంటే పోలీసులు క్రిమినల్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఐదో షెడ్యూల్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.



సభలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ మహాసభ విజయవంతం

ప్రజాశక్తి- జికెవీధి : మండలంలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ 50 మంది సభ్యులతో నిర్వహించారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ సెక్రటరీ జీవన్‌కృష్ణ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యద ర్శులు మండల కమిటీ సభ్యులు అందరూ విద్యార్థి దశ నుంచి ప్రజల పక్షాన పోరాడాలన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యల కోసం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో పోరాడాలన్నారు. కొత్తగా మండల అధ్యక్షులు యిర్మీయా, మండల కార్యదర్శిగా జాన్‌పడాల్, సహాయ కార్యదర్శి జి లోకేష్, మండల ఉపాధ్యక్షులు.పి.రాజేష్, ఎన్నికయ్యారు. గూడెం కొత్త వీధి మండల మహాసభలో 20 మంది మండల కమిటీ సభ్యులను కొత్తగా ఎన్నిక చేశారు.



ఆందోళన చేస్తున్న కాఫీ కార్మికులు

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలోని ఆర్‌వి నగర్ డివిజన్‌లో పని చేస్తున్న చాపగెడ్డ, దేవారపల్లి, సిరిబాల జికె వీధిలో పని చేస్తున్న కాఫీ కార్మికులు ఎపిసిలు వర్క్ అసిస్టెంట్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొర్ర రాజు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చి 20రోజులు అవుతున్నా కనీసం స్పందించలేదు ఎపిఎఫ్ డిసి కాఫీ తోటలు అంతరించి పోతున్నా సరైన దృష్టి సారించలేదన్నారు. ఉన్నత అధికారులు తక్షణమే స్పందించాలని లేదంటే ఈ నెల 6 తేదీ నుంచి సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాఫీ కార్మికులు సంఘం ఆర్‌వి నగర్ డివిజన్ నాయకులు కొర్ర రాజారావు,రామ్మద్, జెడ్జ పడల్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి టిడిపి మండల అధ్యక్షునిగా పెద్దిరాజు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : పార్టీ కోసం అహర్నిశలు నిస్వార్థంగా శ్రమించే వారికి పార్టీ సముచిత గౌరవం ఇస్తుందని మరోసారి నిరూపితమైంది. రాజవొమ్మంగి మండల టిడిపి అధ్యక్షుడిగా పెద్దిరాజు మరోసారి నియమితులయ్యారు. సోమవారం పార్టీ అధిష్టానం విడుదల చేసిన ఆదేశాల ప్రకారం పెద్దిరాజు వరుసగా రెండోసారి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ నాయకులు పెద్దిరాజు ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తానని పెద్దిరాజు తెలిపారు.



కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కరాటే శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం హై స్కూల్‌లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ వారి ఆధ్వర్యంలో కరాటే శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు ఆత్మ రక్షణకై ఈ విద్యను నేర్పుతున్నట్టు రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ డైరెక్టర్ రవి,లక్ష్మీ తెలిపారు. కరాటి గేదెల సూరిబాబు, కరాటి మాస్టర్ వారి శిష్యబృందం తరగతులు చెప్పారు. కార్యక్రమానికిఅడ్డతీగల హై స్కూల్ హెచ్ఎం వెంకటలక్ష్మి, సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, ఎస్ఐ వినోద్ భీరా బాలయోగి, మాజీ స్కూల్ చైర్మన్ చోడిశెట్టి సుబ్బారావు, సీనియర్ రిపోర్టర్ ఏడిది వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దెంగేటి సత్తిబాబు, జనసేన పార్టీకొప్పల జై రాము, టిడిపి నాయకులుసాగర్, అక్కుపల్లి రాజా,గణేష్ హై స్కూల్ టీచర్స్ పిటి పిడి వారి ఆధ్వర్యంలో ఈ కరాటి శిక్షణ కార్యక్రమం పాల్గొనడం జరిగింది.

ఘనంగా కళాఉత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి- మారేడుమిల్లి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల రాష్ట్రస్థాయి ఉద్భవ్-2025 కళా ఉత్సవ్ ఘనంగా ప్రారంభించారని గురుకులాల జాయింట్ కార్యదర్శి వై.వి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉద్భవ్ -2025 కల్చరల్ అండ్ లిటరరీ పెస్ట్ కళా ఉత్సవ్ కార్యక్రమానికి గురుకులాల జాయింట్ కార్యదర్శి వై.వి.యస్‌ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీలు మధుసూదన్ వర్మ, కిషోర్‌బాబు, మారేడుమిల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు కుమారి సార్ల లలిత కుమారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ సరిత తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురుకులాల జాయింట్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి బాలురు 346 మంది, బాలికలు 634 మంది మొత్తం 980 మంది 28 మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు, ఇతర సిబ్బంది 300 మంది వచ్చారు. రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఇఆర్ఎంఎస్ ఉత్సవాలు గిరిజన బాలికలకు ఎంతగానో ఉపయోగప డతాయన్నారు. డిప్యూటీ సెక్రెటరీ మధుసూదన్ వర్మ, డిప్యూటీ జాయింట్ సెక్రెటరీ కిషోర్, నెట్ కన్సల్టెంట్ జి.కృష్ణారావు మాట్లాడుతూ దేశంలో 725 మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరుకు ప్రతిపాదించగా ముందుగా 473 పాఠశాలలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య వైస్ ఎంపిపి రవికుమార్, సర్పంచ్ కొండ జాకోబ్, అధికారులు పాల్గొన్నారు. మొదటిరోజు మొత్తం 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బొర్రాకు నిధులు విడుదల చేయాలి



వినతిపత్రాన్ని ఇస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక శాఖ బొర్రా గుహలు నుండి బొర్రా పంచాయతీకి వచ్చే వాటా ఆదాయంలో సుమారు కోటి రూపాయలు బకాయి నిధులు తక్షణమే విడుదలు చేయాలని కోరుతూ సోమవారం బొర్రా కేవ్స్ మేనేజర్ గౌరీశంకర్ ను కలిసి సర్పంచ్ బృందం లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జన్ని. అప్పారావు మాట్లాడుతూ, పర్యాటక శాఖ నుండి పంచాయతీ కు వచ్చే 20శాతం వాటా గత రెండు మూడు ఏళ్ల నుండి ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. దీంతో సుమారు ఒక్క కోటి రూపాయలు ఆదాయం రావలసిందని తెలిపారు.మొంధా తుఫాన్ ప్రభావ కారణంగా గ్రామాలలో తాగునీటి. డ్రైనేజీ. రోడ్లు. తదితర సమస్యలు ఏర్పడ్డాయని తక్షణమే స్పందించి పర్యాటకశాఖ ఎమ్ డి పంచాయతీ కు రావలసిన ఆదాయాన్ని వెంటనే చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల పంచాయతీ ప్రజలతో బొర్రా గుహలు ముఖ్య ద్వారం వద్ద ఆందోళన కార్యక్రమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేసా కమిటీ సభ్యులు సోమ్మెల. రాంబాబు వార్డు సభ్యులు వైసిపి నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ సింగర్భ గ్రామంలో పశువులు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించామని కాశీపట్నం పశువైద్య అధికారి సాగరి. గణేశ్వరరావు, అనంతగిరి పశువైద్య అధికారి అనిల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశువులు, గొర్రెలు, మేకలకు చిన్నపాటి వ్యాధులతో బాధపడుతున్నట్లు గ్రామస్తుల వినతి మేరకు వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు

డ్రగ్స్ కేసులో ముగ్గురు అరెస్ట్

- 48 ఎల్ఎస్‌డి బ్లాట్స్ స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్లో ఆదివారం సాయంత్రం కలకలం సృష్టించిన డ్రగ్స్ అక్రమ రవాణా కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి మేరీ ప్రశాంతి తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. అరెస్టయిన వారిలో వైసిపి యువ విద్యార్థి అధ్యక్షుడు పులగం కొండారెడ్డి (23), బిటెక్ విద్యార్థులు మురాడ గీత్ చరణ్ (21), తంగి హర్షవర్ధన నాయుడు (22) ఉన్నారని పేర్కొన్నారు. డ్రగ్సను విక్రయించిన సంథన్ పరారిలో ఉన్నాడని, నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ కోసం కోర్టులో హాజరు పరుస్తున్నామని తెలిపారు. వారి నుండి 48 ఎల్ఎస్‌డి బ్లాట్స్, ఓలా ఎలక్ట్రిక్ స్కూటీతో పాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు కల్యాణ్, భాస్కరరావు, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా గుడాల

ప్రజాశక్తి- వేపగుంట : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ విశాఖ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా జివిఎంసి 90 వ వార్డు గోపాలపట్నం లక్ష్మీనగర్ చెందిన గుడాల జగన్నాథరావు నియమితులయ్యారు.కౌన్సిల్ నేషనల్ డైరెక్టర్ ప్రెసిడెంట్ కె.ఆనంద్ అధికారికంగా ప్రకటించారు. జగన్నాథరావు నియామకంపై కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరీనాయుడు హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్ ఉంటేనే జిల్లాలోకి అనుమతి

కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : ప్రమాదాలు నివారణకు పటిష్ట చర్యల్లో భాగంగా జిల్లాలోకి టూ వీలర్స్ వినియోగదారులు హెల్మెట్ ధరిస్తేనే జిల్లాలోకి అనుమతి ఉందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నందు రహదారుల భద్రతపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఉన్న ప్రతి చెక్క పోస్ట్ వద్ద హెల్మెట్ లేనిదే , మద్యం సేవించి వాహనం నడుపుతున్న అనుమతించరాదని పోలీసులను ఆదేశించారు. రద్దీ ఉన్న స్థలాల్లో జీప్స్, ఆటో రిక్షాలు పార్కింగ్ చేయరాదని వారికి కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చెయ్యలాగా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. జిల్లాలో స్థానికంగా ప్రయాణికులకు సరిపడే బస్సులు ఉన్నాయా అని ఆరా తీశారు.

జిల్లాలో ఏ ఏ స్థానిక ప్రదేశాలలో ఆర్టీసీ బస్సు కొరత ఉందో దానిపై పూర్తిగా పరిశీలించి నివేదిక తయారు చేయమని ఆర్టీసీ మరియు ట్రాన్స్పోర్ట్ అధికారులకు ఆదేశించారు. భారీ వాహనాలు 25 టన్స్ కంటే మించరాదని, పగలు సమయంలోను, వారాంతాలలో భారీ వాహనాలు కు అనుమతి లేదని తెలియజేశారు. రాబోయే రెండు మూడు నెలలు జిల్లాలోకి టూరిస్టు రాకపోకలు ఎక్కువ అవుతున్నందున మరింత భద్రతా చర్యలు పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జాతీయ మరియు రాష్ట్ర రహదారులపై నిర్వహిస్తున్న సంతలకు ప్రత్యామ్నంగా దగ్గరగా ఉన్న స్థలాలను కేటాయించి విను వెంటనే సంతలు ఆ స్థలాలకు మార్చడం జరిగేలాగా చూడాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై బస్సు షెల్టర్స్ లో సోలార్ లైట్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. రహదారులకు అనుకుని ఉన్న షాప్స్ ను వెనువెంటనే తొలగించాలని ఆదేశించారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్ని ప్రైవేటు వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని ఆరా తీశారు. ప్రజా వాహనంలో ప్రయాణం భద్రతతో ఉండాలని సూచించారు. ప్రతి వాహనం జిల్లాలో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని తెలిపారు. ప్రతి మద్య దుకాణం వద్ద పోలీసు నిఘా పెట్టి, మద్యం సేవించిన ఉన్న వారిపై జరిమానా జారీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ, డి.ఎస్.పి మొహమ్మద్ షహబాజ్, జిల్లా రహదారులు,భవనాల అధికారి బాల సుందరం బాబు, జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాశ్రావు, అదనపు వైద్యాధికారి డాక్టర్ టీ ప్రతాప్, వైద్య కళాశాల ప్రిన్సిపల్, జిజిహెచ్ సూపరిండెంట్ డి.హేమలత రాణి, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్, డిపిఒ కె. చంద్రశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ పాల్గొన్నారు.

వన్ ధన్ వికాస కేంద్రాల నిర్వహణపై అసంతృప్తి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు చేసిన వన్ దన్ వికాస కేంద్రాల నిర్వహణలో లక్షలు వెచ్చించినా ప్రణాళికలు లేకుండా కొనసాగించడం సాధ్యమేనా అంటూ జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని అరుకు కేంద్రంగా కొర్రాయి వన్దేన్ చిరుధ్యానాలతో బిస్కెట్లు కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బిస్కెట్ల తయారీకి వినియోగించే యంత్రాల పనితీరుతో పాటు తయారీ విధానం, మార్కెటుకు అనుగుణంగా ఉత్పత్తిపై అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కేంద్రం నిర్వాహణకు లక్షలు వెచ్చించినా మార్కెటుకు డిమాండ్ పెరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. లక్షలు వెచ్చించిన కేంద్రాలు మూతబడడానికేనా అంటు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికలు లేకుండా కేంద్రాలను నడపడం సాధ్యపడదని, దీనికతోడు తూతూ మంత్రంగా శిక్షణలు ఇప్పించి వికాస కేంద్రాలు సాధ్యపడదన్నారు.

ఇప్పటికైనా సంఘ మహిళలకు పూరిస్థాయిలో శిక్షణ ఇప్పించి వారికి ఉపాధినిచ్చేలా తోడ్పాటునివ్వాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ ఇప్పించి అందులో నైపుణ్యం కలిగిన మహిళలను తీసుకుని కేంద్రాల నిర్వాహణకు అప్పగిస్తే మార్కెటింగ్ సాధ్యపడుతుందన్నారు. సాగర కుసుమగుడలోని అడ్డాకులు, కొండచీపుర్ల వన్ధన్ వికాస కేంద్రంలో సందర్శించిన ఆయన యంత్రాలను పరిశీలించారు.

అనంతరం మహిళలతో మాట్లాడారు. అడ్డాకుల ప్లేట్లు, కొండచీపుర్లతో వచ్చే ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల క్రితం యంత్రాలను సమకూర్చి ఆపై వదిలేశారని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శిక్షణ ఇవ్వకుండా కేంద్రం ఎలా నడుపుతారని ఆయన ప్రశ్నించారు. కుట్టుమిషన్ తో ఆదాయం సమకూర్చుకునే మహిళలకు మిషన్ల కల్పనపై దృష్టి పెడతామని ఆయన పేర్కొన్నారు. డీఆర్డీఏ పీడీ మురళి, సర్పంచులు శారద, తౌడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, అధికారులు పాల్గొన్నారు.

బివిఎన్‌లో పక్షుల దినోత్సవం

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో ప్రీకెజి చిన్నారులకు పక్షుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ పక్షులు ప్రకృతి సంపద అని, వాటి వల్ల మానవాళికి అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఆహారం, పర్యావరణం పరిరక్షణ, పంటలు మొదలైన వాటితో పాటు ప్రకృతి రమణీయతకు పక్షిజాతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులు నెమలి, పావురం, చిలుక, కాకి, పాలపిట్ట, బాతు, కోడి, కొంగ, పెంగ్విన్ తదితర రూపాలలో విచ్చేసి వాటికోసం వివరించి, ఆట పాటలతో సందడిచేశారు. ఉత్తమ ప్రదర్శన చేసిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయినులు శైలజ, హేమలత, మణి, జానకి,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు, : - జిల్లాలో సేంద్రియ రైతు సంఘాలను ఏర్పాటు చేసి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలని, ప్రధానమంత్రి ధన ధాన్య కషి యోజన లో భాగంగా 36 రకాల ప్రభుత్వం పథకాలను వినియోగించుకొని జిల్లా వ్యవసాయ అభివద్ధిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ సూచించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాని ఈ పథకంలో చేర్చడం జిల్లా ప్రజలకు ఒక వరమని అన్నారు. ఈ పథకంపై అగ్రికల్చర్ , హార్టీకల్చర్ , పశు సవంవర్ధక శాఖ , డి ఆర్ డి ఏ , కోపరేటివ్ , మార్కెటింగ్ శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో సేంద్రియ రైతు సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయంని ప్రోత్సాహించాలని. పంట మార్పిడి విధానం ద్వారా పంట దిగుబడులు సాధించవచ్చానన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్ , లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు , జిల్లా ఉద్యాన శాఖ అధికారి కర్ణ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు 'పింక్‌వాక్'



'పింక్‌వాక్'లో పాల్గొన్న గీతం ఆచార్యులు, విద్యార్థులు

ప్రజాశక్తి-మధురవాడ : మహిళలలో రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో సోమవారం "పింక్‌వాక్" పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం ఉమెన్ లీడర్స్ ఫోరమ్, గీతం రోటరాక్ట్ క్లబ్, గీతం స్టూడెంట్ లైఫ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావుప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, దేశంలో అధిక శాతం మహిళలు రొమ్ముకేన్సర్ బారిన పడుతున్నారని, దీన్ని ప్రాథమిక దశలో గుర్తించేందుకు వ్యాధి లక్షణాలపై అవగాహన, తక్షణమే వైద్యులను సంప్రదించడం ద్వారా కేన్సర్‌ను జయంచవచ్చునని తెలియజేప్పడమే పింక్ వాక్ ఉద్దేశ్యమన్నారు. మహిళల జీవనశైలి, మంచి ఆరోగ్యపు అలవాట్ల ద్వారా రొమ్ము కేన్సర్‌ను దూరం పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. పింక్ వాక్‌లో రొమ్ముకేన్సర్‌పై అవగాహన కలిగించే బ్యానర్లు, పోస్టర్లను విద్యార్థులు ప్రదర్శించారు.

విజయవంతంగా ఐఒటి ఎక్స్‌పో

ప్రజాశక్తి- సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 2025-26 విద్యా సంవత్సరానికి పవర్ సిస్టమ్ జనరేటింగ్ స్టేషన్స్ మోడల్ ఎక్స్‌పో, స్కిల్‌స్కోప్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ల్యాబ్ విజయవంతంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి, సంచాలకులు డాక్టర్ జి మధు కుమార్ ప్రారంభించగా,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి దీపక్ చౌదరి, విభాగాధిపతి డాక్టర్ ఆనంద్ గొందేశి, ఇతర విభాగాధిపుతులు డాక్టర్ జిటి.నాయుడు, (సివిల్), డాక్టర్ జె.బాబు (ఇసిఇ), డాక్టర్ డి.మాధవి (సిఇసి) పాల్గొని విద్యార్థులను అభినందించారు.మోడల్ ఎక్స్‌పోలో బిటెక్ థర్డ్ఇయర్ విద్యార్థులు థర్మల్, న్యూక్లియర్, గ్యాస్, హైహెడ్, లోహెడ్ హైడ్రో పవర్‌ప్లాంట్స్, ఎనర్జీ ఆడిట్ వంటి విద్యుదుత్పత్తి స్టేషనుకు సంబంధించిన పనిమోడల్స్‌ను ప్రదర్శించారు. ఇవి విద్యుదుత్పత్తి, ప్రసార విధానాలు, పునరుత్పాదక శక్తి సమన్వయాలను ప్రతిబింబించాయి..అదే సందర్భంలో విభాగం స్కిల్‌స్కోప్, ఐఒటి ల్యాబ్‌ను ప్రారంభించారు. ఫైనలియర్ బిటెక్ విద్యార్థులు ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్, స్మార్ట్ కార్, .జిపిఎస్ ట్రాకింగ్, ఎర్త్‌క్వేక్ డిటెక్టర్, స్మార్ట్ ఎనర్జీ మీటర్, స్మార్ట్ బ్లైండ్ గైడెన్స్, హెరీమ్ ఆటోమేషన్, రాడార్ సెన్సింగ్ సిస్టమ్ వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రధాన అతిథి డాక్టర్. మధు కుమార్ ఐఒటి పునరుత్పాదక శక్తి స్మార్ట్ గ్రిడ్లు, భవిష్యత్ విద్యుత్ రంగానికి అత్యంత కీలకమన్నారు



మాట్లాడుతున్న పిఒ స్మరణ్‌రాజ్

పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం: ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని రంపచోడవరం పిఒ స్మరణ్‌రాజ్ ఎంపిడిఒలను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావుతో అడిషనల్ ఏడిఎంహెచ్ఒ, కొంతమంది ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించారు. దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాలల్లో తాగునీరు పరీక్షించాలన్నారు. రాజవొమ్మంగి మండలం సంజీవనగర్, జడ్డంగి మెర్జ్ అయిన స్కూళ్లకు గ్రామసభ నిర్వహించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒలు ఎర్రంశెట్టి రాజు, సాల్మన్ రాజు, కుమార్, యాదగిరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం బిర్సా అవిరళ కృషి

ప్రజాశక్తి -రంపచోడవరం : గిరిజనులకు గిరిజన హక్కుల కోసం, భూముల కోసం హక్కులు కల్పించే విధంగా బిర్సా ముండా ఎంతగానో కృషి చేశారని ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ అన్నారు. బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సోమవారం యూత్‌ట్రైనింగ్ సమావేశ భవనంలో వివిధశాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉపాధిహామీ పథకం ఎపిడి శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి బిర్సా ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, రవికుమార్, ఎంపిడిఒలు ఎర్రంశెట్టి రాజు, సాల్మన్ రాజు, కుమార్, యాదగిరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

104 సంచార చికిత్సను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గంగవరం: మోహనాపురం, సర్భవరం, లక్ష్మీపురంలో సోమవారం 104 సంచార చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశిబిరంలో 108 మంది ఒపికి వచ్చారు, అవసరమైన వారికి రక్త పరీక్షలు కూడా చేశారు. దోమతెరలను వాడమని సూచించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎఎన్ఎం రత్నకుమారి, ఆశా కార్యకర్తలు పొల్గొన్నారు.

ఆనకట్ట షట్టర్లు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మడేరు ఆనకట్ట వద్ద ఉన్న తొమ్మిది షట్టర్లు పూర్తిగా దెబ్బతినడంతో సుమారు 2,500 ఎకరాల సాగు భూమికి వెళ్లాల్సిన నీరు వృథాగా పోతోందని మడేరు నీటి సంఘం చైర్మన్ కాళ్ళకూరి సుందరం తెలిపారు. మడేరు కుడి కాలువ ద్వారా సుమారు 1,400 ఎకరాలకు సాగునీరు అందుతుంది, అయితే ట్రప్పు రేవటిపాలెం వద్ద కాలువ దెబ్బతినడంతో నీరు వృథా అవుతోందని సంఘం సభ్యులు వెలిశెట్టి శేషగిరిరావు, కుంజం ప్రకాశం ఆందోళన వ్యక్తం చేశారు. పంటలను రక్షించేందుకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని వారు కోరారు.

మహిళా క్రికెట్ టీమ్‌కు ఐద్వా జేజేలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించి తొలిసారిగా ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు ఐద్వా విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి ఒక ప్రకటనలో హర్షం ప్రకటించి, అభినందనలు తెలిపారు. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రదర్శన దేశ ప్రజలందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. టోర్నీ మొత్తం సమష్టిగా రాణించి ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించారని తెలిపారు. ఈ విజయం దేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ ఉత్సాహంతో మరెందరో మహిళలు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు కేవలం వంటగదికే పరిమితం కాదని, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాలలో రాణిస్తారనడానికి మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించడమే ఉదాహరణ అని వివరించారు. ఉన్న అరకొర అవకాశాలతోనే మహిళా క్రికెటర్లు వరల్డ్ కప్ సాధించడం ముదావహం అని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు ఇప్పటికైనా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేయడం, క్రీడలకు బడ్జెట్ కేటాయింపులు పెంచడం, విద్యాలయాలలో క్రీడలను ప్రోత్సహించడం, అన్ని స్పోర్ట్స్‌లోనూ మహిళలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయడం, మహిళా క్రీడా కారులను లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించడంతో పాటు వారి పట్ల వివక్షత లేకుండా కఠిన చర్యలు తీసుకోగలిగితే మరింత మంది మహిళలు క్రీడల్లో రాణిస్తారన్నారని, మరిన్ని విజయాలను దేశానికి అందించగలుగుతారని పేర్కొన్నారు.

'నివేశ్ బస్‌యాత్ర' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పెట్టుబడిదారుల విద్యా కార్యక్రమం 'నివేశ్ బస్ యాత్ర'ను సోమవారం విశాఖపట్నం నుండి ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా బస్సు కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ (తెలంగాణ) నగరాల్లో పయనించి, ప్రతి నగరంలోని స్థానిక నివాసితులకు పెట్టుబడిదారులకు అవగాహన కల్పిస్తుందని కెనరా రోబెకో ఎఎంసి సేల్స్, మార్కెటింగ్ హెడ్ గౌరవ్ గోయల్ తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రజనీష్ నరులా మాట్లాడుతూ, నేటి ఆర్థిక రంగంలో, విజ్ఞానం అనేది అవగాహన వలె శక్తివంతమైనదని వివరించారు. తగిన సమాచారం ఉన్న పెట్టుబడిదారుడు తమకు తాముగా మెరుగైన నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా ఆర్థిక పర్యావరణ వ్యవస్థను కూడా బలోపేతం చేస్తాడని తెలిపారు. ఆర్థిక విద్యను సమాజాలకు నేరుగా తీసుకురావడమే 'నివేశ్ బస్ యాత్ర' లక్ష్యమని వివరించారు.

ఇప్పటికే కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలకు చేరుకున్న ఈ యాత్రను ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం పెట్టుబడులను సరళీకృతం చేయడానికి, అపోహలను తొలగించడానికి, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను స్వీకరించడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గిరిజనుల ఉన్నత విద్యకు ఎసరు?

- ఏడాదిగా మూతపడిన మారికవలస రెసిడెన్షియల్ కళాశాల
- ఆదివాసీల ఐఐటి, ఎన్ఐటి, ఎంబిబిఎస్ శిక్షణ అడ్మిషన్లకు బ్రేక్!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వెనుకబడిన గిరిజన ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్య శిక్షణ కేంద్రాన్ని రాష్ట్రంలోని 'కూటమి' సర్కార్ అటకెక్కించే యత్నాలు చేస్తోంది. విశాఖ జిల్లా మధురవాడ- మారికవలసలోగల ట్రైబల్ హాస్టల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏడాది కాలంగా మూసివేయడంతో పలువురు గిరిజన విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరమయ్యే పరిస్థితులు దాపురించాయి. ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యాన 'స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సీ' పేర విశాఖ ఏజెన్సీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ తొలి సంవత్సరంలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షలు నిర్వహించడం ద్వారా టాప్ -10లో మిగిలిన వారిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. మారికవలసలోగల ఈ రెసిడెన్షియల్ కాలేజీ ప్రస్తుతం మూతపడడంతో గిరిజన ప్రాంత విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు.

ఉన్నత విద్యలో గిరిజనులకు భరోసా ఈ కేంద్రం...

ప్రతి ఏటా 80 నుంచి 100 మంది విద్యార్థులకు ఐఐటి, ఎన్ఐటి, నీట్, లాసెట్ వంటి ఉన్నత స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక సిబ్బంది ద్వారా శిక్షణ ఇచ్చేవారు. ఆయా సంస్థల్లో గిరిజన విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు ఈ ట్రైనింగ్ బాగా ఉపయోగపడేది. తాజాగా ఈ శిక్షణా కేంద్రాన్ని మూసివేయడంతో అంతటా చర్చనీయాంశంగా మారింది. ఈ కేంద్రం ద్వారా గతంలో ఒక్కో గిరిజన విద్యార్థికి రూ.20వేలు వ్యయంతో 7 నెలల పాటు శిక్షణ ఇచ్చేవారు. 2018-2024 మధ్యకాలంలో ఏటా 100 మంది విద్యార్థులకు ఉన్నత విద్యకోసం ఇక్కడ శిక్షణ లభించేది. ఇప్పటివరకూ 5గురు ఐఐటి, 25 మంది లాసెట్, 26 మంది నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. గడచిన ఏడాది నుంచి సుమారు ఏడుగురు టీచర్లు, సిబ్బందికి జీతాలు చెల్లించలేదు. ట్రైనింగ్ కొనసాగడానికి నిధులను పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ శిక్షణా కేంద్రం మూతపడింది. మొత్తంగా 'కూటమి' ప్రభుత్వం గిరిజనుల ఉన్నత విద్య పట్ల నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి తెలియజేసినా 'స్పాన్సర్'లను వెతుక్కోవాలంటూ ప్రభుత్వం చెప్పడంతో ఫండ్స్‌లేవని ఇక్కడి సిబ్బంది వాపోతున్నారు. దీంతో కొత్త అడ్మిషన్లు ఆగిపోయాయి. 'కూటమి' అధికారంలోకి వచ్చాక నిధులు ఇవ్వలేదు. కొత్త భవనం నిర్మాణం జరిగినా ఆ పనులకు బిల్లులనూ చెల్లించకపోవడం కనిపిస్తోంది.

బడ్జెట్ ఉంటే నిర్వహణ : డిటిడబ్ల్యుఒ సురేష్‌కుమార్

మారికవలసలో గిరిజనుల ఉన్నత విద్య కోసం ఉద్దేశించిన ఐఐటి, నీట్, ఎన్ఐటి ట్రైనింగ్ సెంటర్ నిధుల కొరతను ఎదుర్కొంటున్నందున ఏడాది కాలంగా మూతపడిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.సురేష్‌కుమార్ ప్రజాశక్తికి తెలిపారు. పాడేరు ఐటిడిఎ నిధులతో ఇది నడిచేదని, నిధుల్లేక ఆగినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం : ప్రిన్సిపల్ శివప్రసాద్

నిధులు లేనందున గిరిజనుల ఉన్నత విద్యకు ఇక్కడ శిక్షణ నిలిచిపోయిందని, ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేస్తేనే కొనసాగుతుందని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపల్ శివప్రసాద్ ప్రజాశక్తికి సోమవారం తెలిపారు. అదే సందర్భంలో నూతన భవనం ఒకటి నిర్మాణం అయిందని, బిల్లులు పెండింగ్ వల్ల కాంట్రాక్టరు తమకు అప్పగించడం లేదని తెలిపారు. గిరిజనుల ఉన్నత విద్య ట్రైనింగ్ కోసం ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఫైల్ ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- రంపచోడవరం : డివిజన్‌లోని ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు కూలి సంఘ భవనం నుండి ఐటిడిఎ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లి తరువాత సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వడం, రంపచోడవరం ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ఏర్పాటు చేయడం, ఏజెన్సీలో మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపడం, పీసా చట్టం వంటి 30కు పైగా డిమాండ్లను వారు ఉంచారు. కార్యక్రమంలో పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ, బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు. హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాలు అకిసా సంఘీభావం తెలియజేశారు.

సేవా దృక్పథంతో వైద్య విద్యనభ్యసించాలి

- జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైద్య విద్యను బాధ్యతతో, సామాజిక దృక్పథంతో అభ్యసించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఆంధ్ర వైద్య కళాశాలలో సోమవారం సాయంత్రం 'ఆహ్వాన్ 2025' ఫ్రెషర్స్ డే వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్రెషర్స్ డే ద్వారా స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. కొత్త విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి సానుకూలంగా తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి మాట్లాడుతూ 250 మంది వైద్య విద్యార్థులు కొత్తగా తమ కుటుంబంలో చేరారని, వారి ప్రయాణం ప్రజలకు విలువైన సేవలందించే విధంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.మన్మథరావు (అకడమిక్), డాక్టర్ ఎ.కృష్ణవేణి (జనరల్ వైస్ ప్రిన్సిపల్), డాక్టర్ శ్యామల (కల్చరల్ వైస్ ప్రెసిడెంట్) పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణ విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన సినీ నటుడు కృష్ణ విగ్రహాన్ని సోమవారం తొలగించారు. జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆయన స్పందించి తొలగింపజేశారు. దీనిపై మూర్తి యాదవ్ మాట్లాడుతూ, జగదాంబ జంక్షన్‌లో ఎనిమిది ఏళ్లుగా ఉన్న జనసేన జెండా దిమ్మ తొలగించి కృష్ణ విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. నిబంధనల మేరకు జివిఎంసి ఆమోదంతో బీచ్ రోడ్డులో ఇటువంటి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

జనసేన కార్యకర్త ఆగ్రహం

ఇది ఇలా ఉండగా కృష్ణ అభిమానిగా తాను జగదాంబ జంక్షన్‌లో విగ్రహాన్ని ఏర్పాటుచేశానని 29వ వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. విగ్రహం ఏర్పాటు గురించి ఏడాది క్రితం జివిఎంసికి దరఖాస్తు చేసినట్లు చెప్పారు. నేటి వరకు అనుమతి ఇవ్వలేదని, వచ్చే నెలలో కృష్ణ వర్ధంతి కార్యక్రమం ఉన్న నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా పవన్ కల్యాణ్ విశాఖపట్నం వచ్చిన సందర్భంలో కృష్ణ విగ్రహం ఏర్పాటుచేస్తామని చెప్పగా, ఆయన అంగీకరించారని తెలిపారు.

10 నుంచి ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఎంవిపి కాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనా వేదికగా ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ క్రీడలు నిర్వహించనున్నట్లు విశాఖపట్నం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ విఎస్.జయశంకర్ తెలిపారు. ఎంవిపి.కాలనీలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పోస్టల్ రీజియన్ ఆధ్వర్యాన 40వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించిన లోగో, టీజర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. 14 రాష్ట్రాలకు చెందిన 14 టీమ్‌లు, 121 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. మెన్ సింగిల్స్, డబుల్స్, వుమెన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. క్రీడా ఔత్సాహికులు, సంస్థలు, సాధారణ ప్రజలు ఈ టోర్నమెంట్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో విశాఖపట్నం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌విఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.